భీమవరంలో మాస్టర్ ప్లాన్ అమలయ్యేనా?

- గత ప్రభుత్వంలో కొత్త మాస్టర్ ప్లాన్
- 36 ఏళ్ల తర్వాత అమలుకు చర్యలు
- పట్టణ విస్తరణ, అభివృద్ధికి అడుగులు
- రింగు రోడ్లు, నూతన జోన్ల రాక
- కూటమి ప్రభుత్వం అమలుపై సందేహాలు!


భీమవరం పట్టణ వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండో పెద్ద పట్టణం, జిల్లా కేంద్రంగా ఉన్న భీమవరానికి సుమారు 36 ఏళ్ల తర్వాత నూతన మాస్టర్ ప్లాన్‌కు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. పట్టణ విస్తరణ, అభివృద్ధి లక్ష్యంగా మాస్టర్‌ప్లాన్‌కు అవసరమైన నిధులు, సహాయ సహకారాలు అందించింది. దీంతో నూతన మాస్టర్ ప్లాన్ రూపుదిద్దుకుంది. సర్వే చేసిన జోన్లు, భూమి, రోడ్లు, ఇతర అంశాలను పొందుపర్చి మాస్టర్ ప్లాన్ డ్రాఫ్టును గత ఫిబ్రవరిలో ఏలూరు అర్బన్ డెవలమెంట్ అథారిటీ అధికారులు భీమవరం మున్సిపాలిటీలో ప్రదర్శనకు ఉంచారు. దీనిపై అభ్యంతరాలు, పలు కమిటీల సూచనలు, సలహాలు మొత్తంగా 111 అంశాలను పరిశీలించి ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేసి తుది ప్లాన్‌ను సిద్ధం చేసి గత మార్చిలో జీవో విడుదల చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేస్తుందా.. లేదా అనే సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్లాన్‌ను యథాతథంగా అమలు చేస్తారా లేక మార్పులు, చేర్పులు చేస్తారా అనే చర్చ కూడా జరుగుతుంది.

36 ఏళ్ల తర్వాత : భీమవరం పట్టణానికి సంబంధించి 1987లో మొదటి మాస్టర్ ప్లాన్ తయారు చేయగా ఇప్పటివరకూ అదే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో తాడేరు, కొవ్వాడ, రాయలం, చిన అమిరం, నరసింహపురం, విస్సాకోడేరు, కుముదవల్లి, అన్నవరం గ్రామాలను కలుపుతూ కొత్త మాస్టర్ రూపుదిద్దుకుంది.

విస్తరణ.. జరిగేనా!

భీమవరం అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్‌ను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందా.. లేదా అనే సందేహాలు పట్టణ ప్రజల్లో ఉన్నాయి. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ప్లాన్‌ను తామెందుకు అమలు చేయాలని వదిలేస్తారా అనే చర్చ కూడా జరుగుతోంది. పట్టణ అభివృద్ధి, పెరుగుతున్న జనాభా దృష్ట్యా మరిన్ని మౌలిక వసతుల కల్పనకు నూతన మాస్టర్ ప్లాన్ అమలు అవసరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనతో జిల్లా కేంద్రంగా మారిన భీమవరం ప్రగతికి కొత్త మాస్టర్ ప్లాన్ దోహదపడుతుందని అంటున్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి



భీమవరంలో పెరుగుతున్న జనాభా, విలీన గ్రామాలు, ట్రాఫిక్ సమస్యలు అధిగమించడం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని నూతన మాస్టర్ ప్లాన్ కోసం కృషిచేశాం. ప్లాన్ అమలు చేస్తే పట్టణ రూపురేఖలు మారిపోతాయి. విశాలమైన రోడ్లు, కమర్షియల్ రెసిడెన్షియల్, ఇండస్ట్రీయల్, అగ్రికల్చర్ తదితర నూతన జోన్లు ఏర్పడతాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్లాన్‌లో పలు అంశాలను పొందుపరిచాం. మాస్టర్ ప్లాన్‌కు జీఓ కూడా విడుదల చేశాం. నూతన మాస్టర్‌ను అమలు చేయాలి.

– గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, భీమవరం

ప్లాన్‌లో ముఖ్య అంశాలు

- భీమవరం పట్టణ ప్రస్తుత విస్తీర్ణం 25.64 చదరపు కిలోమీటర్లు కాగా విలీన గ్రామాలతో కలిపి 45.899 చదరపు కిలోమీటర్లు కానుంది.
- పట్టణంలో రెండు 60 అడుగుల రోడ్లు నిర్మించాలి. పీపీ రోడ్డు నుంచి భీమవరం–నరసాపురం రోడ్డుకు అనుసంధానిస్తూ ఔటర్ రింగ్ రోడ్డు, విస్సాకోడేరు లేవుట్ నుంచి గునుపూడి జగనన్న లేవుట్‌కు అనుసంధానిస్తూ రింగు రోడ్డును ప్రతిపాదించారు.
- 30 అడుగుల రోడ్లను అలాగే ఉంచి 40 అడుగుల రోడ్లను 60 అడుగులకు ప్రతిపాదించారు.
- పీపీ రోడ్డు (పాలకొల్లు టూ పామర్రు)ను 60 అడుగుల నుంచి 80 అడుగులకు ప్రతిపాదించారు.
- జువ్వలపాలెం రోడ్డును 80 అడుగులు యథాతథంగా చూపారు.

పౌష్టికాహారంతో గర్భిణికి అదనపు బలం


పౌష్టికాహారంపై ప్రచారం నిర్వహిస్తున్న సిబ్బంది

ఉండి: గర్భిణులు తీసుకునే పౌష్టికాహారం వారికి అదనపు బలమని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఐసీ కీర్తన అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ప్రధానమంత్రి మాతృత్వ యోజన, తదితర పథకాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలో తమ పేరు నమోదు చేసుకోవడమే కాకుండా స్కానింగ్, రక్త పరీక్షలు చేయించుకుని ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలని అన్నారు. పుట్టిన పిల్లలకు ఇమ్యూనైజేషన్ చేయించుకోవాలని అన్నారు. అలా చేసిన వారికి రూ.11 వేలు ప్రభుత్వం నుంచి అందుతాయన్నారు. రెండవ కాన్పులో రూ.5 వేలు వస్తాయని, రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6 వేలు ఇస్తారని అన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణీకి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రక్తం ఎక్కిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, పలువురు గర్భిణులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: గర్భిణులకు వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి ఆధ్వర్యంలో గర్భిణులు, మహిళలు, బాలికలకు కాళ్ల పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఎంఎంవీవై స్కీమ్‌లో గర్భిణులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు. సరాబు సునీల్ మాట్లాడుతూ గర్భిణులు ఆహారం, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు, అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, సీహెచ్‌ఓ విజయావతి, పీహెచ్ఎన్ చండీరాణి ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి


ఎస్పీ అజితను సత్కరిస్తున్న దృశ్యం


భీమవరం: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉన్నత విద్యను అభ్యసించాలని జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. శుక్రవారం స్థానిక భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో స్కూల్ లీడర్స్ ఇన్వెస్టర్ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నిత్యం ఏదో ఒక విషయం నేర్చుకుంటూనే ఉండడంతో పాటు సత్యం ధర్మం పాటించేలా నడవడిక కలిగి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అజితను స్కూల్లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల భవన్స్ స్కూల్స్ సెక్రటరీ యూకే విశ్వనాథరాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఆనంద్ శ్రీనివాస్, స్కూల్ సంచాలకుడు బీవీ శేషగిరి రావు, ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి, దేవిపద్మ తదితరులు పాల్గొన్నారు.


పీఎస్ఎం స్కూల్ హెచ్ఎంగా రాధాకృష్ణ


పీఎస్ఎమ్ స్కూల్ హెచ్ఎం రాధాకృష్ణను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక పొట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్ హెచ్ఎంగా (ఎఫ్ఏసీ) శుక్రవారం వీఎం రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ హెచ్ఎంగా పనిచేసిన జె.సుధారాణి జూన్ నెలలో పదవీ విరమణ చేయడంతో స్కూల్ అసిస్టెంట్ పీఎస్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణకు హెచ్ఎంగా బాధ్యతలు అప్పగించారు. రాధాకృష్ణను యూటీఎఫ్ నాయకులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, గోవింద్, యు.రమేష్ తదితరులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి జెడ్పీ స్కూల్ విద్యార్థుల ఎంపిక


వై.నాగశ్రీ వైష్ణవి, ఆకివీడు


వై.జయశ్రీ, ఆకివీడు


పి.ధనలక్ష్మి, ఆకివీడు

ఆకివీడు: స్థానిక పులవర్తి లక్ష్మణ స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముగ్గురు విద్యార్థులకు ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికయ్యారు. పదవ తరగతి పరీక్షల్లో మండలంలో ప్రథమ స్థానం పొందిన వై.నాగ శ్రీ వైష్ణవికి 576 మార్కులు లభించగా, జయశ్రీ 571, ధనలక్ష్మి 570 మార్కుల సాధించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను స్థానిక ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు అభినందించారు.

రజకులను ఆదుకోవాలి

ఆకివీడు: రజకులు వృత్తి చేసుకునే చెరువులను రజకులకు ఇచ్చి ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కోళ్లపర్రులో రజక చెరువును రజకులకు ఇవ్వాలని కోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలని గురువారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ– 343 ప్రకారం రజకులకు ప్రతి గ్రామంలో చెరువును ఏర్పాటు చేయాలని, దానిని నామ మాత్రపు లీజుకు వారికి కేటాయించాలని గతంలోనే ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో కేశిరెడ్డి కృష్ణ, ఎంపీటీసీ మంతెన రామచంద్రరాజు, గ్రామ రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

భీమవరం అర్బన్: రొయ్యలు, చేపలకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో తీవ్ర నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. భీమవరం మండలం నాగేంద్రపురం గ్రామంలో సీపీఐ మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమల యాజమాన్యం సిండికేట్ ఏర్పడి చేపలు, రొయ్యలను తక్కువ ధరకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. వనామీ రొయ్య 100 కౌంట్‌కు రూ.250 మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్సిడీ, రాయితీపై మేత సరఫరా చేసి నాణ్యమైన సీడ్ ఉత్పత్తి చేయాలన్నారు. ఆక్వా పరిశ్రమల్లో దినసరి మహిళా కూలీలకు కనీస వేతనం రూ.650 అమలు చేయాలన్నారు. దాళ్వా ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సార్వా పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవీఎస్ బ్రహ్మం, సీపీఐ మండల కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, తిరుమాని కామేశ్వరరావు, నాగిడి తులసీ రావు, నాగిడి నాగరాజు, ఎస్. శ్రీనివాస్, నాగిడి రాము, వాటాల పెంటయ్య పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండి: ఈదురు గాలుల కారణంగా శుక్రవారం ఉదయం ఉండిలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది అధికారుల చొరవతో పలు గ్రామాల్లో సుమారు ఉదయం 8 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఉండిలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి


మందపాడులో బ్లీచింగ్ చల్లిస్తున్న డీడీఓ ఆనంద్ భూషణం

ఆకివీడు: వ్యాధులు ప్రబలకుండా, పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని డీడీఓ ఆనంద్ భూషణం విజ్ఞప్తి చేశారు. మండలంలోని మందపాడులో శుక్రవారం పారిశుద్ధ్య పనుల్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో చెత్త రోడ్లపై పారవేయవద్దన్నారు. ఇళ్లల్లోని మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చూడాలన్నారు. మురుగు నీటికి గుంతలు తవ్వుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లోని మురుగునీటి నిల్వలను తొలగించాన్నారు. డెంగీ, అతిసార, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి లలిత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో మంచినీటి సరఫరాను మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మందపాడులో ఫ్రైడే, డ్రైడే, డెంగీ వ్యతిరేక మాసోత్సవ ప్రదర్శన


దోమల నిర్మూలన మందు పిచికారీ చేస్తున్న వైద్యాధికారి రమేష్

ఆకివీడు: వారానికి ఒక్క రోజైనా ఇంటి పరిసరాలను పొడిగా ఉంచితే ఆ ప్రాంతమంతా శుభ్రంగా ఉంటుందని, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండదని వైద్యాధికారి రమేష్ చెప్పారు. మండలంలోని అయిభీమవరం, మందపాడులో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం, డెంగీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలు పొడిగా ఉంటే దోమలు, ఈగలు చేరవన్నారు. బ్యాక్టీరియా, వైరస్‌లు విజృంభించవని చెప్పారు. దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మలాథియన్ మందును ప్రతీ ఇంటి పెరట్లో పిచికారీ చేయించుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే దోమ కాటుతో ప్రాణాపాయ స్థితికి వెళ్లే పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అయిభీమవరంలోని పలు ఇళ్ల వద్ద ఆయన బ్లీచింగ్ చల్లించి, ఫాగింగ్ చేయించారు. దోమల నిర్మూలన మందును గోడలపై పిచికారీ చేయించారు. మందపాడులో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన


ప్రకాశం చౌక్‌లో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవాసంస్థ, ట్రాఫిక్ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెల్మెట్ వాడకంపై అవగాహన నిర్వహించారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో హెల్మెట్ లేకుండా మోటారు సైకిల్ నడుపుతున్నవారికి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగల్ల వెంకట రమణారావు, భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు మోటారుసైకిల్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే తలకు గాయమై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వివరించారు. హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్యా నేరమని మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారులకు చాక్‌లేట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వై.నాగలక్ష్మి, న్యాయవాదులు ఉండవల్లి రమేష్ నాయుడు, వీవీ సుబ్బారావు, ఎస్ సుధీర్, పి.అంబేద్కర్, డి.రవికిరణ్, కె.జ్యోతి, ఆర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన అవసరం


కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో ఎస్ఆర్‌కేఆర్ కళాశాల బృందం

కాళ్ల: విద్యార్థినీ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి కంప్యూటర్ విద్యపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు పేర్కొన్నారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు డిజిటల్ ఫౌండేషన్ పేరిట ఎక్స్‌ప్లోరింగ్ కంప్యూటర్ బ్రెయిన్ అండ్ ఎంఎస్ ఆఫీస్ పేరిట 3 రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి మాట్లాడుతూ ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల తమ పాఠశాల విద్యార్థులు ఉన్నతికి అందిస్తున్న సహాయ సహకారాలకు ఆమె కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ పి భువనేశ్వరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్ర, అంజన, హర్షిత, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర పురుషుల జీవితాలను చదవాలి


భీమవరంలో సుబ్బరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: దేశభక్తి స్ఫూర్తి ఉండాలంటే చరిత్ర పురుషుల జీవిత విశేషాలను చదవాలని, సామాన్య కుటుంబానికి చెందిన తాపీ మేస్త్రి వడ్డి సుబ్బారావు రచించిన 'తాపీ చెక్కిన శిల్పం' పుస్తకం సమాజానికి ఆదర్శమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సుబ్బారావుకు అభినందన సత్కారం ఏర్పాటుచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ స్ఫూర్తితో వీరవాసరం మండలం నవుడూరు సెంటర్‌లో జాతీయ స్థూపాన్ని ఏర్పాటుచేసి, అందులో భారతమాత విగ్రహాన్ని నెలకొల్పడమేగాక, జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ నందమూరి రాజేష్, పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, కె.శిరీష, వబిలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు నిత్యావసరాలు


నిత్యావసర వస్తువుల విక్రయ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సివిల్ సప్లై అధికారులు

అత్తిలి: ప్రజలకు తక్కువ ధరకు నిత్యావసరాలు అందించాలనే ప్రభుత్వ నిర్ణయంతో అత్తిలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేసామని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు తెలిపారు. అధిక ధరలతో సతమతమౌతున్న ప్రజల ఇబ్బందులను గమనించి స్టీమ్డ్ బీపీటీ రైస్ కిలో రూ. 49లకు, పచ్చి బీటీపీ రైస్ కిలో రూ. 48లు, దేశవాళీ కంది పప్పు కిలో రూ. 160లకు ఈకౌంటర్ ద్వారా విక్రయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరాం ప్రసాద్, తూనికలు, కొలతలు శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ నాగరాజు, డీఎస్ఓ సరోజ, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ఎం సత్యనారాయణ, జనసేన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దిరిశాల వెంకట్, దాసరి నాగరాజు, కొనకళ్ల కాంతారావు, రైస్, కిరాణా వర్తకులు పాల్గొన్నారు.

పశుపోషణలో మెలకువలు పాటించాలి


కవిటంలో పశుగ్రాసాలపై అవగాహన కల్పిస్తున్న ఏడీ డాక్టర్ పి.జయకర్

పోడూరు: పాడిరైతులు పశుపోషణలో మెలకువలు పాటించాలని స్థానిక వెటర్నరీ ఏడీ డాక్టర్ పి.జయకర్ పిలుపునిచ్చారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా కవిటంలో శుక్రవారం పశుగ్రాస ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీ జయకర్ మాట్లాడుతూ అధిక పాలదిగుబడులు సాధించడంలో సూపర్‌నేపియర్ పశుగ్రాసం ప్రాముఖ్యతను వివరించారు. మండల పశువైద్యాధికారి డి.మాధురి మాట్లాడుతూ పాల దిగుబడులు, పశువులు చూడికట్టడం కోసం మేలుజాతి పశుగ్రాసాలైన సీఓ–03, సీఓ–4, సీఓ–5, ఏపీబీఎన్, లూసెర్న్, బెరసీమ్ ప్రాముఖ్యతను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: స్థానిక వన్‌టౌన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి 3 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ, చినరంగినిపాలెం, రాజులు వీధి, కలెక్టరేట్ ప్రాంగణం, నరసయ్య అగ్రహారం, కుముదవల్లి రోడ్, ఆర్టీసీ డిపో ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా, మారుతి నగర్, వేంద్ర కాలువ గట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో..

భీమవరం అర్బన్: భీమవరం తాడేరు రోడ్డులోని విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో చెట్లు, కొమ్మలు తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలు, కొన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. వన్‌టౌన్‌లో వైఎస్సార్ కాలనీ, బ్రిడ్జిపేట, అంబేద్కర్ సెంటర్, పోతులవారి పేట, గుల్లంకివారి పేట, ఎంప్లాయిస్ కాలనీ, గరువు పేట, నల్లంవారి తోట, గునుపూడి శివాలయం సెంటర్, సోమగుండం చెరువు ఏరియా, నాచువారి సెంటర్, బేతనిపేట, చిన అప్పారావు తోట, బ్యాంక్ కాలనీ, రెడ్డి కాలనీ, చినపేట, సెయింట్ ఆన్స్ స్కూల్ ఏరియా, తాడేరు, యమునాపల్లి, కొ్రపాడు, బేతపూడి, కరుకువాడ, యనమదుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, 11 కేవీ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం 13వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం తెలిపారు. పట్టణంలో, సమతానగర్, గుమ్ములూరు రోడ్డు, ఇండస్ట్రీస్ ఏరియా, చెరుకువాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

ఉండి: కోలమూరులోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం 13వ తేదీ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరం పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోలమూరు, పాములపర్రు, పులిగుమ్మ, కొండగూడెం, ఉప్పులూరు, కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పాలకోడేరు: శనివారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు 33/11 కేవీ మోగల్లు, విస్సాకోడేరు పైపుల చెరువు సబ్ స్టేషన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పాలకోడేరు, కుముదవల్లి గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏలూరుపాడు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో..

కాళ్ల: ఏలూరుపాడు విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఏలూరుపాడు, జువ్వలపాలెం, పాతకల్లమెరక, కాళ్లకూరు, చెరుకుమిల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.